క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు శనివారం పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

పింఛన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని విలియమ్స్‌పేటలో పింఛన్లను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని వివరించారు.

బెదిరింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : అడిగినంత డబ్బు ఇవ్వకుంటే మీ ఆస్పత్రిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తానని వైద్యుడిని ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన డాక్టర్ పవన్‌కుమార్ వెంకటరామపురంలో హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. తాను అడిగినంత డబ్బులు ఇవ్వకుంటే ఆస్పత్రిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తానని ముత్తుకూరు మండలం మామిడిపూడికి చెందిన కిరణ్ గత కొంతకాలంగా బెదిరిస్తున్నారు. గతనెల 31న హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్తున్న డాక్టర్‌ను బాలాజీనగర్‌లో కిరణ్ అడ్డుకుని నగదు ఇవ్వాలని బెదిరించాడు. ఈ మేరకు బాధితుడు శనివారం బాలాజీనగర్ పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

8న ప్రయాగ్‌రాజ్‌కు ఆర్టీసీ బస్సు

నెల్లూరు సిటీ : ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు నెల్లూరు నుంచి ఈనెల 8వ తేదీన ఆర్టీసీ బస్సు బయలుదేరుతుందని డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. రెండో రోజు సాయంత్రం ప్రయాగ్‌రాజ్ చేరుతుందని, మూడోరోజు ప్రయాగ్‌రాజ్‌లో బస, నాలుగోరోజు అక్కడి నుంచి బయలుదేరుతుందన్నారు. ఇలా మార్గం మధ్యలో ఐదోరోజు అయోధ్యలో బలరాముని దర్శనం, ఆరో రోజు వారణాసి సందర్శన చేసి ఎనిమిదో రోజు (15న) రాత్రి నెల్లూరుకు చేరుతుందన్నారు. చార్జీ రూ.9 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

సమాజ ధర్మమే సనాతనం

నెల్లూరు(బృందావనం) : సమాజంలో ప్రజలు పాటించిన ధర్మమే అసలైన సనాతన ధర్మమని మాజీ ఎమ్మెల్సీ ఎమ్వీఎస్ శర్మ అన్నారు. నగరంలోని వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవంలో ఐదో రోజు ఆరుద్ర సాహిత్య వేదికపై 'ఏది సనాతన ధర్మం?', 'సనాతన ధర్మం అంటే ఏమిటీ?' అనే పుస్తకాలను విమర్శకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎమ్వీఎస్ శర్మ ఆవిష్కరించారు. దీనిని విశ్రాంత ప్రిన్సిపల్, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ కాళిదాసు పురుషోత్తం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతంతో ముడిపడిన రాజకీయాలు నేడు దేశంలో నడుస్తున్నాయని, దీనివల్ల దేశ ఐక్యతకు భంగం కలుగుతుందన్నారు. మతంపేరిట మనువాద ధర్మాన్ని ముందుకు తెచ్చి కులాల పేరుతో చీలికలు పెంచే దుర్మార్గాన్ని నేడు సనాతన ధర్మంగా ప్రచారం చేస్తున్నారన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కన్వీనర్ కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్థికంగా రాణించాలి

- కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు

నెల్లూరు(బృందావనం) : చిరుద్యోగులు, యువత కోళ్ల ఫారాలను స్థాపించి ఆర్థికంగా రాణించాలని జిల్లా పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్‌నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ) డైరెక్టర్ బి.వెంకట్ ఆధ్వర్యంలో నాటు, బాయిలర్ కోళ్ల పెంపకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కోళ్ల పెంపకం, ప్రస్తుత పరిస్థితి, కోళ్ల పెంపకానికి తీసుకోవాల్సిన చర్యలు, కోళ్లకు వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను పశుసంవర్ధకశాఖ అధికారులు వివరించారు. బ్యాంక్, మెప్మా అధికారులు మాట్లాడుతూ కోళ్ల ఫారాల ఏర్పాటు, నిర్వహణ, ప్రభుత్వ సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, పీఎంఈజీపీ, ఎన్‌ఎల్‌ఎం ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయ అధికారి కె.మురళీకృష్ణ, మెప్మా సీఎంఎం అంకయ్య, డీఐసీ ఐపీఓ శ్రీనివాస్ స్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరునికే శఠగోపం

- టీడీపీ నేతల ఆధీనంలో ఆలయ భూములు
- తాటిపర్తిపాళెంలో ఆక్రమణదారుల ఇష్టారాజ్యం
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

అక్కడ ఎకరం ధర కోటి రూపాయలు పైమాటే. దేవస్థానం భూములు ఖాళీగా ఉండటంతో స్థానిక టీడీపీ నేతలు బరితెగించారు. అనుకున్నదే తడవుగా భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించి ఏళ్ల తరబడి వారి ఆధీనంలో ఉంచుకున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేసినా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు పోరాటానికి దిగేందుకు సిద్ధమవుతున్నారు.



దేవస్థాన భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు

వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెం గ్రామంలో మూలస్థానేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి సర్వే నంబరు 1110లో నాలుగు ఎకరాలు, 1109-2లో ఎకరా, 1131లో 0.34 సెంట్లు, 1131-ఏలో 1.02 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ ఎకరం ధర అక్షరాల కోటి రూపాయలు పైనే పలుకుతుంది. ఇందులో 1131-ఏలో ఉన్న 1.02 ఎకరాల దేవస్థానం భూమిని కొందరు టీడీపీ నాయకులు ఏళ్ల తరబడి వారి ఆధీనంలో పెట్టుకున్నారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, గడ్డివాములు, గేదెలకు షెడ్‌లు నిర్మించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు.



ఆక్రమిత భూమిలో వేసిన గడ్డివామి

అధికారుల పట్టింపు ఏదీ?

తాటిపర్తిపాళెంలో రూ.కోటి విలువ చేసే దేవస్థానం భూముల ఆక్రమణలపై స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న భూముల గురించి దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. దేవదాయశాఖ కమిషనర్‌తో పాటు, దేవస్థానం ఈఓకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సామాన్యులు సెంటు స్థలంలో గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు విలువైన దేవస్థానం భూముల ఆక్రమణల గురించి పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

కౌలు నగదు వసూళ్లలోనూ అధికారుల నిర్లక్ష్యం

మూలస్థానేశ్వర దేవస్థానానికి సంబంధించిన భూముల్లో వరిసాగు చేసుకునేందుకు నిర్వహించిన కౌలు వేలం పాటలో దక్కించుకున్న లీజుదారులు ఇప్పటికీ పూర్తిగా నగదు చెల్లించలేదు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆక్రమణదారులు, లీజుదారులు బరితెగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలపై విచారణ చేపడతాం

మూలస్థానేశ్వర దేవస్థానం భూముల ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తాం. అలాగే లీజుదారులు పూర్తిస్థాయిలో నగదు చెల్లించేలా చర్యలు చేపడుతాం.

– మోహన్, ఈఓ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



మూలస్థానేశ్వర దేవస్థానానికి చెందిన విలువైన భూములను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై అధికారులకు పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

– గుమ్మా కిష్టయ్య, తాటిపర్తిపాళెం

చర్యలు తీసుకోవాలి



మూలస్థానేశ్వర దేవస్థానం భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలి. ఆక్రమణలపై గ్రామస్తులంతా కలిసి ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అవసరమైతే పోరాటాలు చేసైనా దేవస్థానం భూములను పరిరక్షించుకుంటాం.

– గుమ్మా మోహన్, తాటిపర్తిపాళెం

ఆక్రమణలు తొలగించాలి



దేవస్థానం భూముల్లో ఆక్రమణలను వెంటనే తొలగించాలి. ఫిర్యాదు చేసినా అధికారుల్లో ఇంత వరకు చలనం లేదు. ఆక్రమణలు తొలగించకుండా గ్రామస్తులందరితో కలిసి ఆందోళనలు చేపడుతాం.


– దేగా శ్రీనివాసులు, తాటిపర్తిపాళెం

వేడుకగా మహాకుంభాభిషేకం



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో పుష్కర మహాకుంభాభిషేకాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. కాగా యంత్రస్థాపన, చాముండేశ్వరీదేవి అమ్మవారు, పరివార దేవతల మహాకుంభాభిషేకాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ గావించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గందళ్ల కృష్ణయ్య- అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అధికారుల తీరుపై విమర్శలు

- వాడీవేడిగా బుచ్చిరెడ్డిపాళెం మండల సమావేశం
- సభ్యుల ప్రశ్నలకు దాటవేత ధోరణి



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రశ్నలకు అధికారులు అస్పష్ట సమాధానాలివ్వడం సభ్యులను ఆగ్రహానికి గురిచేసింది. కనిగిరి రిజర్వాయర్ కరకట్టల ధ్వంసంపై ఎంపీటీసీ వినయ్‌నారాయణ చర్చను ప్రారంభించాడు. గ్రావెల్ తవ్వకాలతో వవ్వేరు వద్ద కనిగిరి కట్టను ఇప్పటికే ధ్వంసం చేశారని ఎమ్మెల్యే హెచ్చరించినా, తిరిగి దీన్ని ప్రారంభించారని చెప్పారు. రిజర్వాయర్ కట్టను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. లోతట్టు ప్రాంతంలో ఓ పెద్ద భవనాన్ని నిర్మించినా, అధికారులు పట్టించుకోకపోవడం వెనుక గల మతలబేమిటని ప్రశ్నించారు. పనులను ఆపేశామని, రిజర్వాయర్ అభివృద్ధికి రూ.60 కోట్లతో అంచనాలను పంపామని ఏఈ తెలిపారు. ప్రధాన ఉప కాలువల మరమ్మతులపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయారు. బుచ్చిరెడ్డిపాళెం, జొన్నవాడలోని ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్లు రాత్రి వేళ ఉండటం లేదని, వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. పసి పిల్లలను రాత్రి వేళ తీసుకొస్తే చికిత్స చేసే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్వరమొస్తే ముందుగా చూసుకోలేరానని డాక్టర్ సమాధానమివ్వడంతో సభ నిర్ఘాంతపోయింది. ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజరా గ్రామాలకు తాగునీరు



ముత్తుకూరులో నిర్మించిన సంపు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు

ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని ప్రతి మజరా గ్రామానికి తాగునీరు అందించేందుకు తలపెట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల క్రితం ఇది మంజూరైంది. రూ.78 లక్షల అంచనాలతో చేపట్టిన పనులు పూర్తయ్యే దశకు వచ్చిందని, దీని ద్వారా పంచాయతీలోని అన్ని వీధులకు తాగునీరు విడుదల చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు శనివారం తెలిపారు. ఇందుకోసం మండల కేంద్రంలో నీటి నిల్వ కోసం భారీ సంపు నిర్మాణం చేపట్టారు. 3 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో చేపట్టిన సంపు నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రస్తుతం భూగర్భంలో ఉన్న పైపులకు అనుసంధానం చేసి నీటి విడుదల చేపట్టేందుకు కొత్త పైపులు కూడా సిద్ధం చేశారు. 1.8 కిలోమీటర్ల మేరకు కొత్త పైపులు అమర్చుతారు.

పరిశ్రమల సహకారం అవసరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధి కోసం పరిశ్రమలు, విద్యాసంస్థల పరస్పర సహకారం అవసరమని విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో 'ఇండస్ట్రీస్- ఇన్‌స్టిట్యూట్' సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పరిశీలనాత్మక నైపుణ్యాలు, వాస్తవ సమస్యలపై పరిశోధన చేయడం, పరిశ్రమ అవసరాలకనుగుణంగా పాఠ్య పుస్తకాలను రూపకల్పన చేయడం ద్వారా విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు సిద్ధం చేయడం వంటి అంశాలు ముఖ్యమైనవన్నారు. అలాగే పరిశ్రమల ప్రతినిధులు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా చేరాలని, తద్వారా పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య నైపుణ్యాల లోటును తీర్చేలా సహకరించాలన్నారు. సమావేశంలో పలు పరిశ్రమల ప్రతినిధులు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయితో దాడి



బాధితుడికి చికిత్స అందిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న పెంచలరావు, పెంచలస్వామి మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దూషించాడనే కారణంతో పెంచలరావు ఓ రాయి తీసుకుని పెంచలస్వామి తలపై దాడి చేశారు. క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్సై హనీఫ్ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పొదలకూరు : పట్టణానికి సమీపంలో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. మనుబోలు పోలీసులతో కలిసి నిర్వహించిన దాడుల్లో నిందితులతో పాటు రూ.22,800 నగదును స్వాధీనం చేసుకున్నారు.

డంపింగ్ యార్డును తరలించాల్సిందే



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కొట్టాలులో గల డంపింగ్ యార్డును తరలించకపోతే ఊరుకునేదిలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. నగర పంచాయతీకి చెందిన ట్రాక్టర్లను శనివారం సాయంత్రం అడ్డుకొని నిరసన తెలిపారు. తమ గ్రామంలో చెత్తను వేయడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, డంపింగ్ యార్డును 24 గంటల్లో వేరే చోటుకు మారుస్తామని హామీ ఇచ్చారని, అయితే యథాప్రకారం తమ గ్రామంలో వేస్తున్నారని ఆరోపించారు. విషయం కమిషనర్‌కు తెలియడంతో ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. డంపింగ్ యార్డును త్వరలోనే తరలిస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు సమస్యల వెల్లువ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని విలియమ్స్‌పేటలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి సమస్యలపై ప్రజలు భారీగా ఫిర్యాదు చేశారు. దీంతో అసహనానికి గురయ్యారు. కొట్టాలు నుంచి నాగమాంబాపురం వెళ్లే రహదారి గుంతలమయమైందని, దీంతో గ్రామంలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామం పక్కనే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని, తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తన భర్త ఏడాది క్రితం మరణించారని, అయితే నేటికీ పింఛన్‌ను మంజూరు చేయలేదని ఓ మహిళ తెలియజేశారు. దీంతో సచివాలయ సిబ్బంది, స్థానిక నేతలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు నెల్లోపు పరిష్కారం కాకపోతే తన వద్దకు రావాలని తెలిపారు. నేతలు శేషయ్య, హరికృష్ణ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ టైర్ పేలి యువకుడికి గాయాలు

పొదలకూరు : ట్రాక్టర్ టైర్ పేలడంతో ఓ యువకుడు గాయపడిన ఘటన పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బిహార్ నుంచి వచ్చిన యువకుడు(పేరు తెలియలేదు) స్థానికంగా వాహనాలకు గాలిపట్టే షాపులో పనిలో చేరాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ చక్రాలకు గాలి పడుతుండగా ప్రమాదవశాత్తు టైరు పేలడంతో గాయపడిన యువకుడిని షాపు నిర్వాహకులు హుటాహుటిన నెల్లూరుకు తరలించారు.

రాజ్యమేలుతున్న అరాచకం

- పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు
- హింసాత్మక ఘటనలతో దారుణాలు
- కొడవలూరులో వైఎస్సార్సీపీ నేతపై దాడి
- ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యం

కోవూరు: పచ్చని పల్లెసీమలతో ప్రశాంతతకు మారుపేరైన కోవూరు నియోజకవర్గంలో అరాచకం రాజ్యమేలుతోంది. అధికార పార్టీ నేతలు రాజకీయ కక్షలతో పేట్రేగిపోతున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా భౌతికదాడులతో ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తోంది. టీడీపీ నేతలుగా చెలామణి అవుతున్న కొందరు ఊరూరా పేకాట, బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. వీరి చర్యలను ఎవరూ ప్రశ్నించకూడదనే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను కొంత కాలంగా టార్గెట్ చేసి దాడులకు తెగబడుతున్నారు. ఏకంగా ఇళ్లలోకి చొరబడి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. తాజాగా కొడవలూరు మండలం నార్తురాజుపాళేనికి చెందిన పార్టీ నేత మోహన్‌రావుపై టీడీపీ నేతలు విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డారు.

టీడీపీ నేత ఇల్లే పేకాట క్లబ్

కొడవలూరు మండలంలో టీడీపీ నేతగా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి ఇంటినే పేకాట క్లబ్‌గా మార్చేశారు. నివాస గృహాల మధ్య జరుగుతున్న పేకాటకు కోవూరు నియోజకవర్గంతో పాటు నెల్లూరుకు చెందిన వారిని తీసుకొచ్చి ఆడిస్తున్నారు. అక్కడే మందు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. దీని కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పోలీసులకు పలుమార్లు సమాచారమిచ్చారు. నిర్వాహకులకు ముందుగానే సమాచారమిచ్చి, ఆ తర్వాత దాడులు చేస్తున్నారు. దీంతో పేకాటరాయుళ్లు, నిర్వాహకులు తప్పించుకుంటున్నారు. సదరు నేతతో పాటు మండలంలోని కొందరు నేతలు ప్రతి గ్రామంలో మద్యం బెల్టు దుకాణాల్లో భాగస్వాములుగా ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకలు వినిపించకూడదని..

పేకాట, మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న నేతలు తమ అసాంఘిక కార్యకలాపాలతో పాటు ప్రభుత్వాన్ని విమర్శించే గొంతుకలు ఉండకూడదని భౌతికదాడులకు తెగబడుతున్నారు. నార్తురాజుపాళేనికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మోహన్‌రావు స్వతహాగా మృదుస్వభావి. పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. ఆయనకు ఎవరితో ఎలాంటి విభేదాల్లేవు. అలాంటి వ్యక్తిపై దాడి వెనుక బెదిరింపు ఉందని తెలుస్తోంది.

బెదిరించి టీడీపీ కండువాలు

టీడీపీ నేతల దాష్టీకాలు ఎక్కువవుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా గెలిచిన సర్పంచ్‌లను బెదిరించి తమ పార్టీ కండువాలు కప్పుతున్నారు. వీరి బెదిరింపులకు లొంగని వారిపై కక్షగట్టి అధికారులకు ఫిర్యాదు చేసి చెక్‌పవర్లను రద్దు చేయిస్తున్నారు. ఏ గ్రామంలోనూ తమకు వ్యతిరేకులు ఉండకూడదనే ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

టీడీపీ దాష్టీకాలు

- గతేడాది ఇందుకూరుపేట మండలం కొరుటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత షబ్బీర్ ఇంట్లోకి చొరబడి కుటుంబసభ్యులను గాయపర్చారు. వస్తువులను ధ్వంసం చేశారు.
- బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో పార్టీ స్థానిక నేతలపై దాడులు చేశారు. బాధితులపైనే కేసులు నమోదు చేశారు.